సాక్షి
సిద్దిపేట
7
ఆదివారం । 5 । అక్టోబర్ । 2025

# పూల బాట

సండే స్పెషల్



బంతి పూల జానకీ.. జానకీ/ ముద్దబంతి నవ్వులో మూగబాసలు/ బంతి చామంతి అంటూ సినీ కవులు అమ్మాయిలను బంతి పూలతో పోలుస్తూ రాసిన పాటలు దాదాపుగా హిట్టు కొట్టాయి. ఇంటా, బయట ఎక్కడ ఏ వేడుక జరిగినా బంతిపూల అలంకరణ సాధారణమైపోయింది. దీంతో ఈ పూలకు భారీ డిమాండ్ ఏర్పడింది. అటు సినీ కవులకు, ఇటు రైతులకు ఈ బంతిపూల పంట కాసుల వర్షం కురిపిస్తోంది. ఆదాయానికి పూలబాట వేస్తున్న బంతిపూల తోటలపై ఈ వారం 'సండే స్పెషల్'. – గౌరారం విజయ్‌రావు, వర్గల్ (గజ్వేల్)

వివరాలు 8లో ►

## న్యూస్‌రీల్

### అమ్మవారి కృపతో అందరూ చల్లగా ఉండాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



పెద్దగుండవెల్లిలో దుర్గామాత నిమజ్జనోత్సవంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: దుర్గామాత కృపతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాకతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత నిమజ్జనోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అన్ని పండుగలు ఘనంగా జరుపుకొనే మంచి సంస్కృతి ,సాంప్రదాయాలు తరాల నుంచి వస్తుందన్నారు. భక్తి భావంతో పాటు ప్రజలు ఐకమత్యంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి



కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాదగిరి

గజ్వేల్‌రూరల్: బడుగు, బలహీన వర్గాలు ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. గజ్వేల్‌కు చెందిన యాదగిరి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమైన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జాగృతి అధ్యక్షురాలు కవితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీల్లో ఐక్యత లోపించిన కారణంగానే రాజ్యాధికారానికి దూరమవుతున్నారని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యత ఎంతో అవసరమన్నారు. వారిని చైతన్యం చేస్తూ సంఘటిత పోరాటం చేస్తామని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జాగృతిని పటిష్టం చేసి సత్తా చాటుతామని పేర్కొన్నారు.

### మహిళల రక్షణే ప్రధాన కర్తవ్యం: సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మహిళల రక్షణే షీటీమ్ ప్రధాన కర్తవ్యమని పోలీసు కమిషనర్ అనురాధ తెలిపారు. మహిళలు, బాలికల రక్షణకు ఉన్న చట్టాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో షీటీమ్ బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో షీటీమ్స్ గత నెలలో 49మంది ఈవ్ టీజర్లను పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించి, వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ల వారీగా హాట్‌స్పాట్‌ల వద్ద నిఘా ఏర్పాటు చేసి 53 ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు సీపీ పేర్కొన్నారు. మహిళలను ఎవరైనా వేధిస్తే డయల్ 100 లేదా షీటీమ్ వాట్సాప్ నంబర్ 8712667434కు ఫోన్ చేయాలని సూచించారు.

### మద్యం షాప్‌లకు మొదటి దరఖాస్తు



దరఖాస్తును స్వీకరిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: జిల్లాలోని మద్యం దుకాణాల నిర్వహణ (2023–25)కు శనివారం మొదటి దరఖాస్తు వచ్చినట్లు ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాస మూర్తి, సీఐ శ్రీనివాస్ తెలిపారు. నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలోని 93 వైన్ షాపుల నిర్వహణకు గత నెల 26వ తేదీ నుంచి ఈ నెల 18వ తేదీ వరకు సిద్దిపేట ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈసారి దరఖాస్తుకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. 23న లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాలను కేటాయించనున్నట్లు తెలిపారు.

### జోరు తగ్గిన మంజీరా



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో శనివారం మంజీరా నది జోరు తగ్గింది. సింగూరు నుంచి 38,467 క్యూసెక్కుల నీరు వదలగా, గతంలో పోలిస్తే ప్రవాహం తక్కువగా కనిపిస్తోంది. అయినప్పటికీ రాజగోపురంలోనే దుర్గమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్నారు.

## భక్తజన నాచగిరి

### కిటకిటలాడిన పుణ్యక్షేత్రం



ప్రసిద్ధ నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రం శనివారం భక్తులతో సందడిగా మారింది. గర్భగుడిలో సర్వాలంకార శోభితులై స్వామి వారు శ్రీలక్ష్మీసమేతులై కొలువుదీరారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పుణ్యస్నానాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కట్నకానుకలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. – వర్గల్(గజ్వేల్)



నాచగిరిలో స్వామివారు, దర్శించుకుంటున్న భక్తులు


# డైలమాలో ఆశావహులు!

**స్థానిక ఎన్నికల రిజర్వేషన్‌పై చర్చ**

కోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

- అందరి చూపు 8వ తేదీ వైపే..

సాక్షి, సిద్దిపేట: స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ ఆశావహుల్లో ఇంకా డైలమా కొనసాగుతోంది. న్యాయపరమైన చిక్కులను దాటి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా.?, లేదా అనే చర్చ పల్లెల్లో సాగుతోంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై ఈ నెల 8వ తేదీన హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందోనని బరిలోనే నిలిచే వారు, అధికారులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు కల్పించింది. అలాగే వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ స్థానం రిజర్వేషన్ గెజిట్‌ను జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. 2018, 2019 జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 22.79 శాతం, ఎస్సీలకు 20.53, ఎస్టీలకు 6.68శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించారు. ప్రస్తుత రిజర్వేషన్ల ప్రకారం ఈ మూడు వర్గాలకు కలిపి 69.21శాతంకు రిజర్వేషన్లు పెరిగాయి. దీంతో 50 శాతానికి మించవద్దని హైకోర్టును పలువురు ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీన హైకోర్టులో విచారణ ఉంది. న్యాయస్థానం ఏమి ఆదేశిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఎక్కడ నలుగురు కలిసినా ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు. కోర్టు ఆదేశాలతో రిజర్వేషన్లు మళ్లీ మారుతాయా? అనే చర్చ అన్ని పార్టీల నాయకుల్లో సాగుతోంది. మరోవైపు 9న ఎంపీటీసీ, జెడ్పీటీసీల మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలు పెట్టేందుకు అధికారులు అన్ని సిద్ధం చేస్తున్నారు.



### సమాయత్తం కావాలంటున్న పార్టీలు

పల్లెల్లో అభివృద్ధి కుంటుపడిందని వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే బీఆర్‌ఎస్ తమ అభిప్రాయం వ్యక్తం చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు జరుగుతాయని క్షేత్రస్థాయి నాయకులకు అప్రమత్తం చేస్తోంది. ఎన్నికలపై సందిగ్ధతను పక్కనబెట్టి సమాయత్తం కావడమే మంచిదనే అభిప్రాయాన్ని ఆయా పార్టీల ముఖ్యనేతలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలకు సూచిస్తున్నారు. స్తబ్దుగా ఉంటే ప్రత్యర్థి పార్టీకి పరిస్థితులు అనుకూలంగా మారే ప్రమాదం లేకపోలేదని శ్రేణులు జాగ్రత్తంగా ఉండాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది.

**రిజర్వేషన్లు మారితే..?**

హైకోర్టు ఆదేశాలతో రిజర్వేషన్లు మారితే ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీలు, సర్పంచ్‌లు ఏవి అన్ రిజర్వ్ (జనరల్), మహిళా అవుతాయో తెలియని పరిస్థితి ఉండగా ,ఆశావహులంతా మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. ముందుకు పోవాలా ? వద్దా అనే అంశంపై తమ సన్నిహితులతో మాట్లాడుకుంటున్నారు. కోర్టు ఆదేశాలతో మార్చాల్సి వస్తే అందుకు సైతం అధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కోర్టు ఆదేశిస్తే మూడు రోజుల్లో మళ్లీ కొత్త రిజర్వేషన్లు మార్చేందుకు సైతం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దీంతో అందరూ ఆసక్తిగా 8వ తేదీన ఉన్నత న్యాయస్థానం తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు.

## దంచికొట్టిన వాన

- గంటన్నరకు పైగా ఏకధాటిగా..
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు

దుబ్బాక: దుబ్బాకలో శనివారం సాయంత్రం వాన దంచికొట్టింది. సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ నీరు రోడ్లపై నుంచి ప్రవహించింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా తయారైంది. శనివారం దుబ్బాకలో అంగడి కావడంతో రైతులు, కూరగాయల వ్యాపారులు, వినియోగదారులు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంతో పాటుగా మండలంలోని చాలా గ్రామాల్లో వర్షం కురిసింది. భారీగా వరద నీరు చేరడంతో పంటలకు నష్టం ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు ఎలా చేతికొస్తాయో అన్న ఆందోళనలో ఉన్నారు.



దుబ్బాకలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిలచిన వరదనీరు

## పేటలో పోటీ.. జెడ్పీ పీఠంపై గురి

రామాయంపేట(మెదక్): జిల్లా పరిషత్ చైర్మన్ స్థానం జనరల్‌కు కేటాయించడంతో ఈ స్థానాన్ని కై వసం చేసుకోవడానికి పార్టీలు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నాయి. జిల్లాలోని 21 జెడ్పీటీసీ స్థానాల్లో రామాయంపేట, కొల్చారం,తూప్రాన్ స్థానాలు జనరల్, నిజాంపేట, పెద్దశంకరంపేట, మనోహరాబాద్ జెడ్పీటీసీ స్థానాలు జనరల్ మహిళలకు కేటాయించారు. మూడు ప్రధాన పార్టీల్లో మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత, మాజీ జిల్లా అధ్యక్షులు, గుర్తింపు పొందిన నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. రామాయంపేటలో పోటీ చేయడానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ భర్త దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మెదక్ నియోజవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాజీ మంత్రి హరీశ్‌రావు ద్వారా ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్‌లో ఆర్ వెంకటాపూర్ మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, దామరచెరువు మాజీ సర్పంచ్ శివప్రసాదరావు, బీజేపీ నుంచి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగి రాములుతో పాటు మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. తమ మండలాల్లో అవకాశం లేని నాయకులు పక్క మండలాలపై దృష్టి సారిస్తున్నారు.

## గజ్వేల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు

గజ్వేల్‌రూరల్: ప్రతి ఒక్కరూ దేశ, దైవ భక్తిని కలిగి ఉండాలని, అలాగే.. సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సహ కార్యవాహ మల్లికార్జున్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో భారీ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోకి ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను తీసుకెళ్లాలని సూచించారు. హిందూ సమాజం జాగృతం కావాల్సిన అవసరముందని, అందరు విధిగా కుటుంబ విలువలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు మంద సాయినాథ్‌రెడ్డి, సామాజిక సమస్త విధిగా ప్రాంత అధ్యక్షులు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న స్వయం సేవకులు

## సమయపాలన పాటించాలి

- వైద్య సిబ్బందికి కలెక్టర్ ఆదేశం
- డుమ్మాకొట్టిన మీర్జాపూర్ సిబ్బందిపై ఆగ్రహం



అక్కన్నపేట పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

అక్కన్నపేట(హుస్నాబాద్)/హుస్నాబాద్‌రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయ పాలన పాటించాలని కలెక్టర్ హైమావతి అన్నారు. శనివారం ఆమె అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అలాగే.. హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో ఎస్ఎస్‌టీ శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఇన్ పేషెంట్లు, అవుట్ పేషెంట్ల వివరాలు, మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే.. హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో ఎస్ఎస్‌టీ శిబిరంలో రిజిస్టర్లను పరిశీలించారు. ఎన్నికల దృష్ట్యా వాహనాల తనిఖీలో వీడియో రికార్డు చేయాలన్నారు. మీర్జాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఒక ఉద్యోగి మినహా అందరూ గైర్హాజరవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.

## లక్ష్యాన్ని అధిగమించాలి

- ఈ ఏడాది స్లాట్ బుకింగ్ ప్రక్రియ
- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిద్దిపేటజోన్: ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యం అధిగమించేందుకు యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. శనివారం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నూతన యాప్ కపాస్ కిసాన్ గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో కొత్తగా యాప్ ప్రవేశ పెట్టినట్టు తెలిపారు. పత్తి రైతులు తప్పనిసరి కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. సీసీఐ ద్వారా ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు పత్తికి రూ.8,110 ప్రకటించిందని, అది పొందడానికి యాప్‌లో స్లాట్ ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పత్తి రైతులకు యాప్ గురించి అవగాహన కల్పించాలన్నారు. కౌలు రైతులకు మాత్రం వ్యవసాయ విస్తరణ అధికారులు తమ లాగిన్ ద్వారా స్లాట్ బుకింగ్ చేయాలని సూచించారు. యాప్ నిర్వహణ, మద్దతు ధర తదితర అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ రీజినల్ డైరెక్టర్ మల్లేశం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి స్వరూపరాణి, జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ.. జంపింగ్‌ల మేళా

**జోరుగా రాజకీయ వలసలు**

- పార్టీలు మారుతున్న నాయకులు
- రెండు నెలలుగా సాగుతున్న పరంపర



మెదక్‌జోన్: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో జంపింగ్ పాలిటిక్స్ జోరందుకున్నాయి. రెండు నెలలుగా ఈ పరంపర సాగుతూనే ఉంది. సాధారణ కార్యకర్తలు మొదలుకొని నియోజకవర్గ, మండలస్థాయి నాయకుల వరకు పార్టీలు మారుతున్నారు. ఈ వ్యవహారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు వెన్నంటి ఉన్న యువ నేత జీవన్‌రావు, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్ యూటర్న్ తీసుకొని రెండు నెలల క్రితం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అప్పట్లో జిల్లాలో ఇది హాట్‌టాపిక్‌గా మారింది. దీనికి కౌంటర్‌గా ఎమ్మెల్యే రోహిత్‌రావు, కాంగ్రెస్ రాష్ట్ర నేత మైనంపల్లి హన్మంతరావు జిల్లాలో భారీ బహిరంగ సభను ఏర్పాటుచేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌ను ఆహ్వానించారు. ఈ సభలో నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లతో పాటు బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి కార్యకర్తలు, నేతలు పెద్దఎత్తున కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారితో పాటు ప్రముఖ సంఘ సేవకుడు లీలా గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

**అటోళ్లు ఇటు.. ఇటోళ్లు అటు**

కొడిపల్లి మండలం దేవులపల్లికి చెందిన సుమారు 30 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు రెండు రోజుల క్రితం అధికార పార్టీకి గుడ్‌బై చెప్పి ఎమ్మెల్యే సునీతారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. వీరు పార్టీ మారడానికి ప్రధాన కారణం ఇటీవల యూరియా కొరతతో పాటు స్థానికంగా ఉన్న నేతలతో పొసగకపోవటమేనని తెలుస్తోంది. పెద్దశంకరంపేట బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సీనియర్ నేత మురళి (పంతులు) ఇటీవల ఆ పార్టీని వీడారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో ఆయనతో పాటు మరో 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పెద్దశంకరంపేట మేజర్ పంచాయతీతో పాటు ఆ మండల ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు సైతం జనరల్ మహిళకు రిజర్వేషన్ కావటంతో ఆయన అధికార పార్టీ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. తాజాగా పాపన్నపేట మండల పరిధిలోని పలు పార్టీలకు చెందిన నాయకులు హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, జిల్లా నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మళ్లీ బీజేపీ వైపు పంజా చూపు!**

రామాయంపేట(మెదక్): స్థానిక సంస్థల ఎన్నికల వేళ జిల్లాలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ నుంచి బీజేపీ తరఫున పోటీ చేసిన నిజాంపేట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పంజా విజయకుమార్ జూలై 20న కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పంజా ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి పంజా పార్టీ కార్యకలాపాలకు దూరంగానే ఉన్నారు.

# ప్రజాధనం నేలపాలు!

- ఆస్పత్రి విస్తరణ పేరిట పాత భవనాలు కూల్చివేత
- 250 పడకల ఆస్పత్రి కోసమేనంటున్న అధికారులు, పాలకులు
- మాతా శిశు సంరక్షణ కేంద్రానికి రోగులు, వైద్య పరికరాలు తరలింపు

ఒకే ప్రాంగణంలో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి భవనాలను నేలమట్టం చేశారు. నాటి ఆనవాళ్లు లేకుండా తుడిచి పెట్టుకుపోయాయి. స్థలం కొరతతో ఇదే ప్రాంగణంలో కొత్తగా 250 పడకల ఆస్పత్రి భవనాన్ని నిర్మించాలని వీటిని కూల్చివేశారు. కాగా ప్రజాధనం వృథా అయ్యిందని పలువురు ఆరోపిస్తున్నారు. – హుస్నాబాద్



50 పడకల ఆస్పత్రి భవనం





30 పడకల ఆస్పత్రి భవనం

హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. తరువాత మరో 20 పడకలకు పెంచారు. రోగుల సంఖ్య పెరగడంతో ప్రత్యేక రాష్ట్రంలో ఈ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ మే, 30, 2017లో అప్పటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. మొత్తంగా 100 పడకల ఆస్పత్రిగా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం ఆస్పత్రికి రోజుకు 400 మంది రోగులు వివిధ చికిత్స కోసం వస్తున్నారు. ప్రసవాల సంఖ్యతోపాటు కిడ్నీ రోగులకు డయాలసిస్, మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా సాగుతున్నాయి.

**మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు**

హుస్నాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ప్రస్తుతం ఉన్న వంద పడకల ఆస్పత్రిని ప్రభుత్వం 250 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ ఆస్పత్రి నిర్మాణం కోసం రూ.82 కోట్లు మంజూరు చేసింది. అయితే.. ఆస్పత్రి నిర్మాణానికి స్థలం సరిపోదని నిర్ణయించారు. దీంతో ఇప్పటికే ఉన్న వంద పడకల ఆస్పత్రి భవనాలను పూర్తిగా కూల్చివేసి, నూతన ఆస్పత్రిని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం కూల్చివేత పనులు తుది దశకు చేరుకున్నాయి.



పాత ఆస్పత్రుల భవనాలను నేలమట్టం చేసిన దృశ్యం

**మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలింపు**

ఆస్పత్రి ప్రాంగణంలో ఇటీవల ప్రారంభించిన మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంకా డాక్టర్లు, సిబ్బంది, ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉంది. రోగులతో పాటు వైద్య పరికరాలను తరలించారు. నూతన భవనం పూర్తి అయ్యే వరకు ఇక్కడే వైద్య సేవలు అందనున్నాయి.

క్లుప్తంగా

## ఆటో డ్రైవర్ కూతురుకు ఎంబీబీఎస్‌లో సీటు



అంజుమ్‌కు అభినందనలు తెలుపుతున్న స్థానికులు

పుల్‌కల్(అందోల్): ఆటో డ్రైవర్ కూతురు ఎంబీబీఎస్‌లో ప్రతిభ చాటింది. మండల పరిధిలోని గొంగ్లూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఫక్రుద్దిన్ కూతురు అంజుమ్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. వనపర్తి మెడికల్ కళాశాలలో సీటు కేటాయించారు. అంజుమ్ పదో తరగతి వరకు స్వగ్రామంలో, ఇంటర్ ప్రభుత్వ గురుకుల కళాశాలలో చదివింది. ఈ సందర్భంగా ఆమెను డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆర్ రాంచంద్రారెడ్డి, గోపాల్ రెడ్డి సన్మానించి అభినందనలు తెలిపారు.

## కంప్యూటర్స్ చోరీ

మద్దూరు(హుస్నాబాద్): మోడల్ స్కూల్‌లో దొంగలు కంప్యూటర్లను ఎత్తికెళ్లారు. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో మండలంలోని పాఠశాల ఉపాధ్యాయులు ప్రధాన ద్వారానికి తాళం వేసి వెళ్లారు. కాగా గత నెల 27న రాత్రి 8గంటల సమయంలో దొంగలు అసంపూర్తిగా ఉన్న భవనంలోకి వెనుకవైపు నుంచి ప్రవేశించారు. కంప్యూటర్ ల్యాబ్ కిటికీని పగులగొట్టి లోపలికి వెళ్లారు. ల్యాబ్ వెలుపల, లోపల ఉన్న సీసీ కెమెరాల డైరెక్షన్‌ను మార్చి సుమారు రూ.6లక్షల విలువ జేసే తొమ్మిది ల్యాప్‌ట్యాప్‌లు, మూడు కంప్యూటర్స్‌ను ఎత్తుకెళ్లారు. శనివారం స్కూల్‌కు వచ్చిన ఉపాధ్యాయులు గుర్తించారు. స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా చేర్యాల సీఐ శ్రీను క్లూస్‌టీంతో కలిసి పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు.

## పర్మిట్ రూమ్‌లో వ్యక్తి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): పర్మిట్ రూమ్‌లో మద్యం తాగిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ మండలం మంభోజిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మెదక్ పట్టణం నర్సిఖేడ్‌కు చెందిన నీలగిరి సురేశ్(36) మంభోజిపల్లి వద్దకు వచ్చి కల్లు తాగాడు. అనంతరం మద్యం దుకాణంలోకి వెళ్లి మద్యం తాగి అక్కడే పడిపోయాడు. విషయాన్ని గుర్తించిన మద్యం షాపు యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని సంబంధీకులు ఎవరు ఫిర్యాదు చేయకపోవడంతో మృతదేహాన్ని మెదక్ ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు మెదక్‌రూరల్ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

## చికిత్స పొందుతూ మహిళ..

చేర్యాల(సిద్దిపేట): మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు, బంధువులు వివరాల ప్రకారం... మండలంలోని తడ్కపల్లి గ్రామానికి చెందిన గడీల సంతోష్‌కుమార్‌కు సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన భాగ్యలక్ష్మి(30)తో 2018లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు పట్టణ కేంద్రంలో నివాసముంటుండగా, సంతోష్ ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో విద్యుత్‌షాక్ తగిలి కింద పడిందని, ఆస్పత్రికి తీసుకెళ్తున్నామని బావమరిదికి సంతోష్ ఫోన్ చేసి చెప్పాడు. అపస్మారకస్థితిలో ఉన్న భాగ్యలక్ష్మిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. కాగా తమ కూతురును భర్త, అత్త కలిసి హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారంటూ మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేటకమాన్: ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... ప్రభాకరాచారి స్వర్ణకారుడిగా పని చేస్తూ కుటుంబంతో కలిసి వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం దసరా పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి జనగామలోని అత్తగారింటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.20వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో వివరాలు సేకరించారు.



# పూల బాట

## సాగు సులభం.. ఆదాయం ఘనం

బంతి..మనసుదోచే పుష్పరాజం. 'ముద్ద బంతి పూవులో'..అంటూ బంతి గొప్పదనం చాటే సినీకవుల పాటలు.. పండుగలు, పెళ్లిళ్లు, గృహప్రవేశాలకు ఈ పూలను వినియోగిస్తారు. పరిశ్రమలు, గుడిలో పూజలు, ఉత్సవాల వేళ బంతి పూలే కీలకం. కాగా హైదరాబాద్‌కు అత్యంత చేరువలోని సిద్దిపేట జిల్లా ఉద్యాన తోటలకు నెలవుగా విలసిల్లుతున్నది. పత్తిలాంటి పంటలు నష్టాలపాలు జేస్తుండటంతో జిల్లా రైతాంగం సాగు చేస్తున్న బంతిపై ఈ వారం కథనం.

– వర్గల్(గజ్వేల్):



వర్గల్ మండలం చాదరిపల్లిలో సాగుచేసిన బంతిపూల తోట



- కాసులు కురిపిస్తున్న బంతి సాగు
- శుభకార్యాల్లో తనదైన స్థానం
- హైదరాబాద్, బెంగళూరు, ముంబై లాంటి పట్టణాలకు తరలింపు

తక్కువ పెట్టుబడి, అధిక లాభాలు పంచే బంతి సాగు వైపు రైతులు మొగ్గ చూపుతున్నారు. పెద్దగా చీడపీడల బెడద లేకపోవడం, తక్కువ వ్యవధిలో దిగుబడి వస్తుండటంతో ఆసక్తి పెరుగుతున్నది. సిద్దిపేట జిల్లాలో దాదాపు 350 ఎకరాల్లో బంతి సాగవుతోంది. కొందరు రైతులు ప్రధాన పంటగా బంతిని సాగు చేస్తుంటే, ఇంకొందరు అంతర పంటగా సాగు చేస్తున్నారు

**పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌కు..**



ములుగు వద్ద రాజీవ్‌రహదారిపై పూల విక్రయాల సందడి


ఉత్సవాలు, పండుగలు, పెళ్లిళ్ల సీజన్, శుభకార్యాల తరుణంలో బంతిపూలకు బాగా డిమాండ్ ఉంటుంది. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో వచ్చే పండుగలు, శుభకార్యాలకు కోత వచ్చేలా రైతులు ప్రణాళికగా బంతిని సాగు చేస్తారు. జిల్లాలోని ములుగు, వర్గల్, గజ్వేల్, జగదేవ్‌పూర్, మర్కూక్, రాయపోల్, దౌల్తాబాద్, సిద్దిపేట, దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, కొండపాక, కుకునూరుపల్లి, చిన్నకోడూరు తదితర మండలాల్లో 250కి పైగా రైతులు సాగు చేస్తున్నారు.

**బడా వ్యాపారులే కొనుగోలుదారులు**

బంతికి ప్రత్యేకంగా మార్కెటింగ్ సదుపాయం లేదు. హైదరాబాద్, కరీంనగర్, సూర్యాపేట, బెంగళూరు, ముంబై తదితర ప్రాంతాల బడా వ్యాపారులు బంతి సాగు చేసిన రైతులను ఫోన్ ద్వారా సంప్రదిస్తారు. పూలను తోటల నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తారు. జిల్లా నుంచి హైదరాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, వరంగల్, సూర్యాపేట, నల్గొండ, బెంగళూరు, ముంబై తదితర పట్టణాలకు తరలిస్తూ పూల ద్వారా అదనపు ఆదాయం గడిస్తారు.



బంతిపూలతో మహిళా రైతు



### దీపావళికి వచ్చేది బోనసే..

రైతులు సాధారణంగా దసరా, దీపావళి పండుగలు ఫోకస్‌గా బంతి సాగుచేస్తారు. దసరా తరుణంలో ఒకసారి, దీపావళికి మరోసారి పూలు కోసి విక్రయించేలా ప్రణాళిక చేస్తారు. ప్రస్తుతం బతుకమ్మ, దసరా పండుగ, శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. వీటి కోసం ఇప్పటికే సగం పైగా పూల విక్రయం ముగిసింది. ధర కూడా ఆశించినట్లు ఉండటంతో ఈ సారి లాభాలు బాగున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరానికి అన్ని ఖర్చులు పోగా ఇప్పటికే రూ. 2లక్షల మేర ఆదాయం సమకూరిందంటున్నారు. దీపావళి వరకు తోట నిలబడి పూల దిగుబడి ఆశాజనకంగా ఉంటే అది బోనసేనని చెబుతున్నారు.

### సగటున 7 టన్నుల దిగుబడి

బంతి ఎకరానికి సగటున 7 టన్నుల దిగుబడి వస్తుంది. పత్తి మాదిరిగా తెగుళ్ల బెడద ఉండదు. తక్కువ వ్యవధిలో లాభాలు వస్తుండటంతో దాదాపు మూడు దశాబ్దాల నుంచి జిల్లా రైతాంగం ఇటు వైపు మొగ్గుతున్నారు. ఎకరం బంతి సాగుకు రూ.50వేల దాకా పెట్టుబడి అవుతుంది. ప్రస్తుత మార్కెట్ ధరలు పరిశీలిస్తే హోల్‌సేల్‌గా కిలో బంతి పూలు రూ. 50 నుంచి 80 దాకా, రిటేల్‌లో తోటల వద్ద, రోడ్డు పక్కన రూ.75 నుంచి 150 దాకా అటు ఇటుగా ధరలు పలుకుతున్నాయి. ఎకరం సాగు ద్వారా సగటున రూ. 4 లక్షల నుంచి రూ. 6 లక్షల దాకా ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు.

### పదేళ్లుగా సాగు



పదేళ్లుగా బంతి పూలు సాగు చేస్తున్న.పండుగలు, వేడుకలు, పలు శుభకార్యాలకు పంట అందేలా మొక్కలు నాటుతాం. పెట్టుబడి మొత్తం రూ. 40 వేల నుంచి 50 వేల వరకు అవుతుంది. ఎకరానికి 5 టన్నులకు పైగా దిగుబడి వస్తుంది.

– బొల్లిపల్లి రవీందర్‌రెడ్డి చౌదరిపల్లి, వర్గల్ మండలం)

### ముద్దాపూర్‌లో 30 ఎకరాల్లో..



మా గ్రామంలో దాదాపు 30 ఎకరాల్లో బంతి సాగు చేస్తారు. నేను మూడు దశాబ్దాలుగా సాగు చేస్తున్న. పెద్దగా తెగుళ్లు, రోగాలు రావు. దసరా, దీపావళికి పంట కోతకు వచ్చేటట్టు సాగుచేస్తం. వ్యాపారులు తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుండడంతో భారం తగ్గుతుంది.

– కన్నెబోయిన వెంకట్‌రెడ్డి, రైతు ముద్దాపూర్

### ఉద్యాన రైతులకు ప్రోత్సాహం

ఉద్యాన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.8వేల వరకు ప్రోత్సాహం అందిస్తుంది. సాగుకు సంబంధించిన రశీదులతోపాటు, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్‌లను అప్లికేషన్‌ను ఉద్యాన అధికారి కార్యాలయంలో సమర్పించాలి.

– సౌమ్య, గజ్వేల్ డివిజన్ ఉద్యాన అధికారి

# దంపతుల మధ్య గొడవ..

### భార్య అదృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళ అదృశ్యమైంది. ఎస్‌ఐ మురళి వివరాల ప్రకారం... మండలంలోని భుజిరంపేట గ్రామానికి చెందిన సంది కృష్ణ, పుష్పలత భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కాగా ఈనెల 3న భార్య పుట్టింటికి వెళతానని భర్తకు చెప్పడంతో అన్న ఇంట్లో ఫంక్షన్ ఉంది వద్దన్నాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగగా భార్యపై చేయిచేసుకున్నాడు. అనంతరం భర్త పొలం వద్దకు వెళ్లాడు. తరువాత భర్త ముగ్గురు కూతుళ్లను తీసుకుని కౌడిపల్లికి వచ్చి మధ్యాహ్నం తిరిగి వెళ్లేసరికి పుష్పలత ఇంట్లోలేదు. స్థానికంగా, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

**అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో..**



సోనియా వాస్వాని

పటాన్‌చెరు టౌన్: ఓ యువతి అదృశ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓడీఎఫ్ కాలనీకి చెందిన సోనియా వాస్వాని (22) గేటెడ్ కమ్యూనిటీ మల్లంపేటలో సెక్యూరిటీ స్టాఫ్‌గా పనిచేస్తుంది.ఈ క్రమంలో 2వ తేదీన తల్లి ఆశ పండుగ నేపథ్యంలో తన సోదరి ఇంటికి వెళ్లింది. తిరిగి 3వ తేదీన ఇంటికి వచ్చి చూడగా కూతురు కనిపించలేదు. దీంతో స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

**రేగోడ్‌లో విద్యార్థిని..**



జగదీశ్వరి

రేగోడ్(మెదక్): విద్యార్థిని అదృశ్యమైన ఘటన మండలంలోని మర్పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పోచయ్య కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కమ్మరి జగదీశ్వరి (18) శుక్రవారం ఉదయం రేగోడ్‌లోని మీసేవ కేంద్రానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**నర్సాపూర్‌లో మహిళ ..**

నర్సాపూర్ రూరల్: మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని గూడెంగడ్డలో జరిగింది. ఎస్సై రంజిత్ రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అవంచ దుర్గయ్య, భార్య జ్యోతి (34) దంపతులు. కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం దుర్గయ్య తన పొలంలో పండించిన కూరగాయలను నర్సాపూర్‌లో అమ్మడానికి వచ్చాడు. భర్త ఇంటి నుంచి వెళ్లిన కొద్దిసేపటికి తాను కూడా కూరగాయలు అమ్మడానికి నాన్న వద్దకు వెళ్తున్నానని కొడుకుకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరా తీసిన ఫలితం లేదు.

**ఝరాసంగంలో యువతి..**



పావని

జహీరాబాద్ టౌన్: యువతి అదృశ్యమైంది. రూరల్ ఎస్‌.ఐ.కాశీనాథ్ వివరాల ప్రకారం... ఝరాసంగం మండలంలోని పొట్‌పల్లి గ్రామానికి చెందిన బూచన్‌పల్లి సామేల్ కూతురు పావని(19) సెప్టెంబర్ 29న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### మరో ఘటనలో తల్లీకొడుకు..



అదృశ్యం అయిన తల్లీకొడుకు

శివ్వంపేట్ల(నర్సాపూర్): కొడుకుతో సహా తల్లి అదృశ్యమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పెద్దకోళ్ల పోచయ్యతో నవాబుపేట గ్రామానికి చెందిన అమూల్యకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కొడుకు వరుణ్‌తేజ్ ఉన్నాడు. కాగా ఈనెల 3వ తేదీన సంసారం విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం భర్త పొలం దగ్గరకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి భార్య, కొడుకు కనిపించలేదు. వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### వలస కూలీ మృతి

చేర్యాల(సిద్దిపేట): వలస కూలీ అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గడ్డం ఏడుకొండలు(45) భార్య పిల్లలతో కలిసి స్థానికంగా నివాసముంటున్నాడు. కట్టె బొగ్గు కాల్చే కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత బుధవారం భార్య పిల్లలు తిరుపతికి వెళ్లగా ఒక్కడే గదిలో ఉంటున్నాడు. శనివారం ఉదయం వారు వచ్చి చూడగా ఇంట్లో మృతి చెంది ఉన్నాడు.

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ మురళి వివరాల ప్రకారం... మండల కేంద్రమైన కౌడిపల్లిలోని పెద్ద చెరువు బతుకమ్మ ఘాట్‌వద్ద సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం నీటిలో గుర్తించారు. మృతుడు నలుపురంగు అంగీ, కాకిరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడు ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో పడి మునిగి మృతి చెందాడా? లేక ఎవరైనా పడేశారా అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### స్నేహితులకు లిఫ్టు ఇద్దామని వెళ్లి..

– రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పుల్‌కల్(అందోల్): బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట వద్ద శనివారం జరిగింది. వివరాలు ఇలా... సదాశివపేట మండలం మాలపాడుకు చెందిన మన్నే మల్లేశం(41) శనివారం మధ్యాహ్నం స్వగ్రామం నుంచి అందోల్ మండలం అక్సాన్‌పల్లి గ్రామంలో ఉన్న స్నేహితులను బైక్‌పై తీసుకురావడానికి వస్తున్నాడు. ఈ క్రమంలో పుల్‌కల్ మండలం పెద్దారెడ్డిపేట సమీపంలో వచ్చిన మరో ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మాలపాడు గ్రామానికి చెందిన మన్నే మల్లేశం బైకు పైనుంచి ఎగిరిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

# మద్యం పట్టివేత

రేగోడ్(మెదక్): బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేశారు. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పోచయ్య శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలో అక్రమంగా మద్యం షాపులు నడపుతున్నారన్న సమాచారం మేరకు ఆయా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొండాపూర్‌లో 16.57 లీటర్లు, జగిర్యాలలో 12.19 లీటర్లు, ఆర్.ఇటిక్యాలలో 16.57లీటర్లు, రేగోడ్‌లో 22.18 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని తెలిపారు. కాగా అక్రమ బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



చిన్నశంకరంపేట(మెదక్): సంకాపూర్‌లో స్వాధీనం చేసుకున్న మద్యం

**మరో చోట 57 లీటర్లు...**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తిశివనూర్, సంకాపూర్, నర్సంపల్లి గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మూడు చోట్ల కలిపి 57 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సృజన తెలిపారు. బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

# పండుగకు వచ్చి పరలోకానికి..

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన డీసీఎం
- ట్రాక్టర్‌లోని హార్వెస్టర్ కట్టర్‌బార్ ఢీకొని తల్లీకూతురు మృతి
- ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో హార్వెస్టర్ బార్ కట్టర్‌ను ఢీకొన్న డీసీఎం వాహనం

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో తల్లీ, కూతురు మృతి చెందారు. ఈ ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. బెజ్జంకి ఎస్‌ఐ సౌజన్య, బంధువుల కథనం ప్రకారం... కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన వీణారాణి, సుమన్ వారి కుమార్తెలు యశస్విని, మనస్వినిలతో కలిసి కోహెడ మండలంలోని వింజపల్లికి దసరా పండుగకు వీణా తమ్ముడి ఇంటికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్న క్రమంలో దేవక్కపల్లె సమీపంలోని రాజీవ్ రహదారి పక్కన అమ్ముతున్న సీతాఫలాలు కొనేందుకు దిగుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వైపునకు హార్వెస్టర్ కట్టర్‌బార్‌ను రిపేరుకు తీసుకెళుతున్న ట్రాక్టర్‌ను అదే వైపునకు వెళుతున్న డీసీఎం అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ రోడ్డు పక్కకు పడిపోగా హార్వెస్టర్ కట్టర్‌బార్ సుమన్, వీణారాణి, యశస్విని, మనస్వినిలకు తగిలింది. దీంతో వీణారాణి



వీణారాణి



యశస్విని

(39), యశస్విని (6) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలైన మనస్విని, సుమన్, ట్రాక్టర్ డ్రైవర్ రాజులను కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మనస్వినిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సుమన్ స్వగ్రామంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. మద్యం మత్తులో అతివేగంగా డీసీఎం నడుపుతూ ఢీకొట్టిన ఆయుబ్‌ఖాన్‌పై మృతురాలి సోదరుడు జగదీశ్వరాచారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఘటనా స్థలాన్ని ట్రాఫిక్ ఏసీపీ సుమన్, సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

# మూడు రోజుల్లో ముగ్గురు మృతి

– ధర్మారంలో విషాదం



అంత్యక్రియల్లో పాల్గొన్న ధర్మారం గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): మూడు రోజుల్లో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మారంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... బుధవారం సద్దుల బతుకమ్మ పండుగ రోజున గ్రామానికి చెందిన వరద రాజయ్య (60) పాలు తీసుకురావడానికి దుకాణానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు సపర్యలు చేస్తున్న క్రమంలోనే ఆయన మృతి చెందాడు. గురువారం దసరా రోజున ఆయన అంత్యక్రియలు ముగిసిన తర్వాత అదే గ్రామానికి చెందిన సద్ది పున్నారెడ్డి (58) అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం ఆయన అంత్యక్రియలు జరుగుతున్న సమయంలో ఇదే గ్రామానికి చెందిన కూరాకుల దేవయ్య (38) అనుమానాస్పద స్థితిలో సిద్దిపేట మండలంలోని ఇర్కోడు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. ఇక దేవయ్య మృతదేహం శనివారం గ్రామానికి రావడంతో అంత్యక్రియలు నిర్వహించారు. వరుసగా మూడు రోజుల్లో ముగ్గురు మృతి చెందడంతో గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# పక్షవాతంతో.. జీవితంపై విరక్తి చెంది..

### విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి జిల్లాలో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.

పటాన్‌చెరు టౌన్: అనారోగ్యంతో మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగికి చెందిన సాయిలు(53) సంవత్సరం క్రితం కుడి చేయి, కుడి కాలు పక్షవాతం కారణంగా పనిచేయడం లేదు. అయితే భార్య నర్సమ్మ కూలి పని చేసుకుంటూ ఇంటిని పోషిస్తుంది. ఇంటికి భారమవుతున్నానని, నేను బతికి ఉండే కంటే చనిపోవడం మేలని భార్యతో చెబుతూ బాధపడేవాడు. ఈ క్రమంలో 3వ తేదీన నరసమ్మ పనికి వెళ్లి, తిరిగి 4న ఇంటికి వచ్చి చూసేసరికి భర్త గుర్తుతెలియని విషం తాగి, వాంతులు చేసుకుంటూ కనిపించాడు. దీంతో వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు.

### కుటుంబ కలహాలతో..



శ్రీను

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని బీమ్లా పంచాయతీ టౌర్యా తండాకు చెందిన జరుప్ల శ్రీను(40) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆర్థిక, కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య దేవితో పాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

### అనారోగ్య సమస్యలతో మహిళ..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. సదాశివపేట సీఐ వెంకటేశ్ వివరాల మేరకు.. మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన కంకోల్ భాగ్యమ్మ(56)కూలి పనులు చేస్తూ కుమారుడితో కలిసి జీవిస్తుంది. ఆమెకు కాళ్ల నొప్పులతో బాధపడుతుంది. ఈ క్రమంలో అనారోగ్య సమస్యలు భరించలేక గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### మద్యం మత్తులో యువకుడు..



నాగరాజు

అల్లాదుర్గం(మెదక్): యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం మండలంలోని కాయిదంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వంకిడి నాగరాజు (28) జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బతుకమ్మ, విజయదశమి పండగను జరుపుకునేందుకు కాయిదంపల్లికి వచ్చాడు. ఇదిలా ఉండగా.. శుక్రవారం సాయంత్రం అతిగా మద్యం తాగి తన ఇంట్లో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా కుటుంబీకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో నాగరాజు అదే మత్తులో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో శనివారం గాలించగా సమీపంలోని ఊరచెరువు వద్ద అతడి సెల్‌ఫోన్ కనిపించగా స్థానికులు గాలించగా మృతదేహం లభ్యమైంది.